www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | మంగళవారం 25,ఆగస్టు, 2026

## వైభవోపేతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు

# పకడ్బందీ ఏర్పాట్లు



2 లో..

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు

అక్రమ విద్యుత్ కనెక్షన్లు, అధిక శబ్దం, రోడ్ల ఆక్రమణలకు తావు ఇవ్వద్దు

నిమజ్జన పాయింట్ల వద్ద నీటి లభ్యతకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి

గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్, సిపి

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు-24 (భద్రాద్రిన్యూస్ ):** వైభవోపేతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. కలెక్టరేట్‌లో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గణేష్ ఉత్సవాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు అందిస్తున్న సహకారం అభినందనీయమని, గణేష్ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన అనుమతులు నిబంధనల మేరకు అందిస్తామని తెలిపారు. ప్రతి గణేష్ మండపానికి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, మండపాలు ఏర్పాటు చేసే సమయంలో ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని, పూర్తి రోడ్డు ఆక్రమించేలా మండపాలు ఏర్పాటు చేయరాదని సూచించారు. వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యుత్ మండపాల వద్ద షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయరాదని అన్నారు. అనవసరంగా భారీ సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయకుండా నిబంధనలు పాటించాలని సూచించారు.



3లో

## ఫెర్టిలైజర్ వ్యాపారుల మాయాజాలం

ధరల దోపిడీకి పాల్పడుతున్న మాఫియా

ఒక్కో షాపులో ఒక్కో ధర

వ్యవసాయ శాఖ నిఘా వైఫల్యం.. అవినీతి మత్తులో కొందరు అధికారులు

రైతుల కొంపముంచుతున్న ఫెర్టిలైజర్ మాఫియా ఆగడాలు

## చిరుతపులి చర్మం, గోర్లను విక్రయిస్తున్న

# నలుగురు వ్యక్తులు అరెస్ట్



2లో

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 24 (భద్రాద్రి న్యూస్):**

చిరుత పులి చర్మం గోర్లను విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడారు... విశ్వసనీయ సమాచారం మేరకు, బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఇ. నాగ బిక్షం, టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం సమయంలో తాళ్లగొమ్మూరు గ్రామం అనిల్ అనే వ్యక్తి ఇంటి వద్ద, ఒక చిన్న బ్యాగ్‌తో అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు.

భద్రాద్రి న్యూస్
మంగళవారం 25,ఆగస్టు, 2026

# వైభవోపేతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**మొదటి పేజీ తరువాయి**

గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు. ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో గణేష్ నిమజ్జనానికి అవసరమైన నీటి సరఫరాపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అన్నారు. నీటిని ఎక్కడి నుంచి తీసుకురావాలి, ఎలా నిల్వ చేయాలి అనే అంశాలపై ముందుగానే చర్యలు ప్రారంభించాలని, నీటి నిల్వ సాధ్యం కాని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం పాయింట్ల వద్ద అవసరమైన బ్యారికేడ్లు, క్రేన్లు, త్రాగునీరు, లైటింగ్ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. నిమజ్జనం సందర్భంగా జిల్లాలో ఎక్కడా మద్యం విక్రయాలు జరగకుండా మద్యనిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, 108 వాహనం, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద మూడు షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి నిరంతరం పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లకు అదనపు డ్రైవర్లు, క్రేన్ మరమ్మతులు చేసే మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జనం రోజున ఉదయం 6 గంటలకే క్రేన్లు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. విగ్రహాల తరలింపుకు అడ్డుగా వచ్చే చెట్టు కొమ్మలను ముందుగానే తొలగించాలని అన్నారు.

నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేరకు గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని, స్విమ్మర్లతో ముందుగానే చర్చించి వారికి విధుల షిఫ్ట్ వివరాలను తెలియజేయాలని అన్నారు. ప్రతి వినాయక మండపం వద్ద పోలీస్, ఫైర్, విద్యుత్, వైద్య తదితర అత్యవసర సేవల సంప్రదింపు వివరాలతో కూడిన చిన్న పోస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు.

గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేయాలని, నిమజ్జన రూట్లలో అవసరమైన రోడ్డు మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో ఎత్తైన విగ్రహాల తరలింపును ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు.

నిమజ్జన పాయింట్లకు అప్రోచ్ రోడ్లు సక్రమంగా ఉండేలా చూడాలని, ప్రతి వినాయక మండపాన్ని రిజిస్టర్ చేసి, అక్కడ చేపడుతున్న ఏర్పాట్ల వివరాలను ముందుగానే సేకరించాలని అన్నారు. విగ్రహాల తరలింపుకు అడ్డుగా ఉన్న ఇంటర్నెట్, టీవీ కేబుళ్లను సరిచేయాలని సూచించారు.

ప్రతి గణేష్ మండపానికి ప్రభుత్వం నిబంధనల మేరకు విద్యుత్ కనెక్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. లైన్‌మ్యాన్ ద్వారా విద్యుత్ కనెక్షన్ అందించేలా చూడాలని, ప్రజలు స్వయంగా విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని ప్రమాదాలకు గురికావద్దని కలెక్టర్ కోరారు.

పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ అన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేసి గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా శాంతి కమిటీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. నిమజ్జనం రోజున శోభాయాత్ర, చివరి పూజ కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు ప్రణాళిక చేసుకోవాలని కోరారు. విగ్రహాల తరలింపునకు అవసరమైన వాహనాలను ముందుగానే బుక్ చేసుకోవాలని, రూట్ మ్యాప్‌ను ముందుగానే ఖరారు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్, ఉత్సవ కమిటీలు, పోలీస్ అధికారులు సమన్వయంతో నిమజ్జన రూట్ మ్యాప్‌ను ఖరారు చేయాలని అన్నారు. నిమజ్జనం పాయింట్ల వద్ద తగినంత త్రాగునీరు అందుబాటులో ఉంచాలని, అవసరమైన డ్రైవర్లు, మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని సూచించారు. నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు పోలీస్ శాఖ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.

ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ సెప్టెంబర్ 15లోగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని తెలిపారు. నిమజ్జన రూట్లలో స్ట్రీట్ లైటింగ్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ప్రతి సంవత్సరం అధికారులు అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు. ఈసారి కూడా అధికారులు, పోలీస్, మున్సిపల్, విద్యుత్, ఫైర్, వైద్య శాఖలు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు.

ప్రస్తుతం మున్నేరు నదిలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున వినాయక విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన నీటిని ముందుగానే అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిమజ్జన పాయింట్ల వద్ద కనీసం 7 ప్లాట్ ఫాం లు, 7 క్రేన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

సెప్టెంబర్ 14న వినాయక చవితి, సెప్టెంబర్ 23న నిమజ్జనం నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి గణేష్ మండపానికి అవసరమైన అనుమతులు త్వరగా మంజూరు చేయాలని, ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని ప్రతి మండపానికి అందేలా చూడాలని కోరారు. నిమజ్జనం రోజున నిర్వహించే శోభాయాత్ర రూట్‌లో రోడ్డు



మరమ్మతులు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, విగ్రహాల తరలింపులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

గణేష్ మండపాల వద్ద అక్రమ విద్యుత్ కనెక్షన్లు లేకుండా, రోడ్లను పూర్తిగా ఆక్రమించకుండా ఉత్సవాలు నిర్వహించేలా కమిటీ సభ్యులు సహకరిస్తారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు, నిమజ్జనం జరిగేలా పోలీస్, జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

అనంతరం గణేష్ మండపం నిర్వాహకులకు సూచనలు తెలుపుతూ ముద్రించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్, సిపి ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, జెడ్పీ సిఇఓ దీక్షా రైనా, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసా చారి, జిల్లా పంచాయతీ అధికారి వినోద్ కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. రామారావు, జిల్లా రవాణా అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి జానయ్య, జిల్లా అగ్నిమాపక అధికారి అజయ్ కుమార్, స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రెసిడెంట్ వినోద్ లహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ కె. జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, ట్రెజరర్ ఎం. శ్రీహరి, సెక్రటరీ డోవలె సాయికిరణ్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ కు ఘన స్వాగతం

**–జూలూరుపాడు లో ఘన స్వాగతం పలికిన బీజేపీ మండల నాయకులు**

**జూలూరుపాడు /చంద్రుగొండ (భద్రాద్రి న్యూస్) ప్రతినిధి:** జూలూరుపాడు మండల కేంద్రంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ కు మండలానికి చెందిన బిజెపి నాయకులు భూక్యా రమేష్ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్, గిరిజన మోర్చా ఉపాధక్షులు శ్యాంరాథోడ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గిరిజన కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం తెలిపారు. గిరిజనుల సంక్షేమం, హక్కులు, అభివృద్ధి తదితర అంశాలపై ఈ సందర్భంగా నాయకులు చర్చించారు. గిరిజనుల సమస్యలను జాతీయ స్థాయిలో పరిష్కరించేందుకు ఎస్టీ కమిషన్ చేస్తున్న కృషిని నాయకులు అభినందించారు. గిరిజన సమాజ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అవకాశాలు మరింతగా చేరేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు మండల బీజేపీ ఉపాధ్యక్షులు దరావత బాలకిషన్ , గోపాలరావు , ప్రధాన కార్యదర్శులు రామారావు, భూక్యా శ్రీను , గిరిజన మోర్చా అధ్యక్షుడు రవి , యువమోర్చ అధ్యక్షుడు రాంబాబు,కార్యదర్శి బాబూలాల్ , ఓబీసీ మోర్చా నాయకులు నవీన్ , సోషల్ మీడియా కన్వీనర్ చరణ్ ,పృధ్వీ , ఖమ్మం రూలర్ మండలం అధ్యక్షులు జాటోత్ మధు, గిరిజన కుల సంఘాల నాయకులు కేశవ్ నాయక్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



## చిరుతపులి చర్మం, గోర్లను విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులు అరెస్ట్

**మొదటి పేజీ తరువాయి**

విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, నిందితులు గత సంవత్సరం వేసవి కాలంలో చింతూరు మండలం గమ్మలకోట గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో గుంతలో పడిపోయి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్న చిరుతపులిని రాళ్లు, కర్రలు తో కొట్టి మరియు భాణాలు విసిరి చంపినట్లు తెలిపారు. అనంతరం దాని చర్మం మరియు గోర్లను తొలగించి, చర్మాన్ని ఎండబెట్టి, గోర్లను భద్రపరిచి ఉంచినట్లు వెల్లడించారు.

తరువాత చిరుతపులి చర్మం , గోర్లను విక్రయించి డబ్బు సంపాదించాలని ప్రయత్నిస్తుండగా సారపాకకు చెందిన చల్లా అనిల్ కుమార్ అనే వ్యక్తి భూమిని కౌలుకు తీసుకునే వ్యవసాయం చేయుట కొరకు గమ్మలకోట గ్రామం,చింతూరు మండలం కు చెందిన కుంజా భద్రయ్య వద్దకు రాగా అతనిని సంప్రదించినట్లు తెలిపారు. అనిల్ కుమార్ కొనుగోలుదారులను సంప్రదించి విక్రయానికి సహకరిస్తానని చెప్పడంతో, కుంజ భద్రయ్య, కుంజా గంగరాజు మరియు మడవి కన్నయ్య ముగ్గురు కలిసి చిరుతపులి చర్మం మరియు గోర్లను ఒక చిన్న బ్యాగ్‌లో పెట్టుకుని తాళ్లగొమ్మూరులోని అనిల్ కుమార్ ఇంటికి తీసుకువచ్చారు.ఈ క్రమంలో చిరుతపులి చర్మాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.నిందితుల వద్ద నుంచి చిరుతపులి చర్మం మరియు (17) గోర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వివరాలను వెల్లడించారు.

పట్టుబడిన ముద్దాయిల వివరాలు

1. చల్లా అనిల్ కుమార్ , తాళ్లగొమ్మూరు గ్రామం, సారపాక,బూర్గంపహాడ్ మండలం.
2. కుంజ భద్రయ్య , గమ్మలకోట గ్రామం, చింతూరు మండలం,పోలవరం జిల్లా.
3. కుంజా గంగరాజు ,గమ్మలకోట గ్రామం, చింతూరు మండలం, పోలవరం జిల్లా.
4. మడవి కన్నయ్య ,గమ్మలకోట గ్రామం, చింతూరు మండలం,పోలవరం జిల్లా.

పట్టుబడిన / స్వాధీనం చేసుకున్న ప్రాపర్టీ

1. చిరుతపులి చర్మం -- 01-ఎండిన స్థితిలో ఉన్నది.
2. చిరుతపులి గోర్లు -- 17
3. చిన్న బ్యాగ్ -- 01 (చిరుతపులి చర్మం , గోర్లను తరలించేందుకు ఉపయోగించినది.)

ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్సైలు నాగ బిక్షం, ప్రవీణ్, సుమన్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యత - పోస్టర్ ఆవిష్కరణ



**భద్రాద్రి కొత్తగూడెం ,ఆగస్టు 24 (భద్రాద్రిన్యూస్ ):**
గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక అవగాహనను పెంపొందించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 6 ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ( సుజాత నగర్, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి , మణుగూరు, భద్రాచలం, దమ్మపేట) మంజూరు చేశారు. ప్రతి కేంద్రంలో “విడ్స్ “ స్వచ్ఛంద సంస్థ ద్వారా, ముగ్గురు కౌన్సిలర్స్ ను నియమించి, వారికి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. వారు వారికి కేటాయించిన గ్రామాలలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలకు పొదుపు, పెట్టుబడి, ఆర్థిక క్రమశిక్షణ, బ్యాంక్ లావాదేవీలపై అవగాహన, బ్యాంక్ రుణాలు, సక్రమ రుణ చరిత్ర అవశ్యకత, సైబర్ మోసాల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ సందర్భంగా, పోస్టర్ ను వేణుగోపాల్, అధనపు కలెక్టర్ (రెవెన్యూ), శ్రీమతి .విద్యాచందన, అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఆవిష్కరించారు . ఆర్థిక వ్యవహారాలలో సరైన అవగాహన, అప్రమత్తత చాలా అవసరమని, రిజర్వ్ బ్యాంక్ ఈ దిశగా చర్యలు తీసుకోవడం అభినందనీయమని వేణు గోపాల్, అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాలలో జరిగే ఈ ఆర్థిక అవగాహన కార్యక్రమాలకు సహకరించే విధంగా గ్రామ స్థాయి సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆర్థిక శిక్షణా కేంద్రాల కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

# గురుకుల టెండర్ లలో గోల్మాల్

**అనర్హులకు టెండర్ లు ఆరోపణలు కలెక్టర్ తనిఖీకి డిమాండ్..**



**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు24( భద్రాద్రి న్యూస్):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కళాశాలలకు సరఫరా చేసే మటన్ ,చికెన్ టెండర్ల ప్రక్రియ తీవ్ర విమర్శలకు దారి తీసినట్లు సమాచారం. అధికారులు కొంతమంది పెద్ద కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నిబంధనలను పాతర వేసి ఉల్లంఘించారంటూ జిల్లా కలెక్టర్ కు చాలామంది టెండర్ దారులు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. ముఖ్యంగా టెండర్ దారుల డిమాండ్ లు, నిబంధనలు అధికారులు ఉల్లంఘించారంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జి.ఎస్.టి , ఈ ఎం డి , ఐ టి ఆర్ , ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ కుల ధ్రువీకరణ, అనుభవ అర్హతలు వెరిఫికేషన్ లో కొందరికే మినహాయింపులు ఇచ్చారనే వాదనలు సందేహాలు అధికంగా వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా టెండర్ల ప్రక్రియ గడువు ముగిశాక అనగా ఆగస్టు 13న జరిగిన టెండర్ లో సమయం ముగిసిన పత్రాలు స్వీకరించారని సంతకాలు లేని టెండర్లను పరిగణంలోకి తీసుకున్నారని టెండర్ దారులు ఆరోపించారు. అధికారులు కలెక్టర్ వీడియో ఆధారాలు పరిశీలన చేపట్టాలని బయట నుంచి పత్రాలు తెచ్చి కొందరికి లబ్ధి చేకూరే విధంగా ఏర్పాటు చేశారని వాటిని వీడియో ఆధారాలను తనిఖీ చేసి విచారణ చేపట్టాలని కోరారు. అగ్ర కులాల వారికి టెండర్ లు ఇవ్వడం వల్ల ఎస్సీ, ఎస్టీ ,మహిళ కాంట్రాక్టర్ లకు తీవ్ర అన్యాయం జరిగిందని ఇతర రాష్ట్రాల చిరునామాలు ఉన్నవారికి అవకాశాలు కల్పించేలా కుట్ర చేశారనే విమర్శలు అధికంగా వెలువెత్తాయి. విచారణ పూర్తయ్య వరకు ఆర్డర్లు ఇవ్వద్దని పారదర్శకత లేకపోతే టెండర్లను రద్దుచేసి రిటైన్డర్ నిర్వహించాలని దరఖాస్తు చేసుకున్న టెండూ దారులు స్పష్టం చేశారు దీనిపై జిల్లా యంత్రాంగం స్పందించి విచారణ చేపట్టి న్యాయబద్ధంగా చట్టబద్ధంగా అర్హులకు టెండర్లు ఇవ్వాల్సిందిగా కోరారు. కొందరు టెండర్ దారులు కలెక్టర్ స్పందన కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం.

# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి





**అదనపు కలెక్టర్ వేణుగోపాల్**

**ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి**

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 24 (భద్రాద్రిన్యూస్ ):**
సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఆర్ఓ పద్మావతితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, గృహాలు, ఉపాధి, విద్యుత్, మౌలిక వసతులు తదితర అంశాలపై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కీలక వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

వినతుల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇతర సమస్యలను సంబంధిత శాఖలకు పంపించి వాటి పరిష్కార స్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి ప్రజలకు సత్వర సేవలు అందించాలని తెలిపారు.

జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీఓ కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఆధార పత్రాలతో వినతులు సమర్పిస్తే పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని అన్నారు .

**ప్రజావాణిలో వచ్చిన కొన్ని వినతులు**

. ఇల్లందు మండలానికి చెందిన రచ్చ సుజాత 2008లో ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్ సమక్షంలో జనజీవన స్రవంతిలోకి వచ్చి లొంగిపోయినట్లు తెలిపారు. సీపీఐ (ఎంఎల్) పీపీజీ గ్రూప్‌కు చెందిన లింగన్న దళంలో ఆరు సంవత్సరాల పాటు దళ సభ్యురాలిగా పనిచేసిన అనంతరం లొంగిపోయిన సమయంలో ప్రభుత్వం ఐదు ఎకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చినట్లు, ప్రస్తుతం భర్త మృతి చెందడంతో ముగ్గురు పిల్లలతో ఒంటరి మహిళగా జీవిస్తున్నానని, ఇప్పటివరకు భూమి కేటాయించలేదని, తనకు హామీ ఇచ్చిన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం ఓఎస్–ఈకి ఎండార్స్ చేశారు.

. అశ్వారావుపేట మండలం దిబ్బగూడెం గ్రామానికి చెందిన తాటి పద్మ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. గతంలో సమర్పించిన దరఖాస్తును పరిశీలించి అర్హత మేరకు ఇల్లు మంజూరు చేయాలని కోరగా పరిశీలించి తగు చర్యలు నిమిత్తం పీడీ హౌసింగ్‌కు ఎండార్స్ చేశారు.

కొత్తగూడెం కార్పొరేషన్ 53వ డివిజన్‌కు చెందిన ముద్దంగుల మహేష్ రహదారి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం ఎన్‌పీడీసీఎల్‌కు ఎండార్స్ చేశారు.

సుజాతనగర్ మండలం సర్వారం తండాకు చెందిన బాణోత్ హిమబిందు తన కుటుంబం గతంలో అంగన్‌వాడీ పాఠశాల నిర్మాణం కోసం ప్రభుత్వానికి భూమి ఇచ్చిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని, తాను డిప్లొమా, బీటెక్ (జుజుజు) పూర్తి చేసినందున అర్హత మేరకు ప్రభుత్వ ఉద్యోగం లేదా అంగన్‌వాడీ పోస్టు కల్పించాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు డీడబ్ల్యూఓకు ఎండార్స్ చేశారు.

అశ్వారావుపేట మండలం రామన్నగూడెం సర్పంచ్ మడకం నాగేశ్వరరావు ఎల్–3 జాబితాలో ఉన్న అర్హులైన 71 మంది లబ్ధిదారులను ఎల్–1 జాబితాలోకి మార్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును తగు చర్యల నిమిత్తం పీడీ హౌసింగ్‌కు ఎండార్స్ చేశారు.

ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఫెర్టిలైజర్ వ్యాపారుల మాయాజాలం

**భద్రాద్రి న్యూస్ భూపాలపల్లి**
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పలు మండలల్లో పలు గ్రామాల్లో ఎరువులు, పురుగుల మందుల ధరలు సామాన్య రైతులకు గుదిబండ మారుతున్నాయి. కొంతమంది ఫెర్టిలైజర్ దుకాణదారులు ప్రభుత్వ నిబంధనను తుంగలో తొక్కి, ఇష్టారాజ్యంగా అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న వివరాల ప్రకారం, మార్కెట్లో యూరియా ఎమ్మార్పీ ధర 267 రూపాయలు మాత్రమే ఉండగా, దుకాణదారులు మాత్రం దాన్ని ఏకంగా 320 నుండి 350 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. అలాగే 1350 రూపాయలు ఉండాల్సిన డి.ఏ.పి ధరను 1850 రూపాయల చొప్పున అమ్ముతూ మనుషులు పీల్చుకుంటున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అధికారిక యాప్ ద్వారా బుక్ చేసుకుని కొనుగోలు చేసినప్పటికీ, నిర్ణయించిన ధరల కంటే అదనపు వసూళ్లు చేస్తున్నారని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఒక్కో షాపులో ఒక్కో రేటు.. అడిగితే నిర్లక్ష్యం!**

ఈ దోపిడీ కేవలం ఎరువులకే పరిమితం కాలేదు. పంటలకు కొట్టే స్ప్రే (పురుగుల మందుల)ను కూడా ఒక్కొక్క షాపులో ఒక్కో రేటుకు విక్రయిస్తు దారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం వల్లే వ్యాపారులు ఇంతలా రెచ్చిపోతున్నారని, దొకారుల చేతిలో తాము నిలువునా మోసపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**డిమాండ్**

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలు మండలల్లో పలు గ్రామాలల్లో ఫెర్టిలైజర్ షాపులపై తనిఖీలు చేపట్టాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్ చేస్తుంది. ప్రతి దుకాణంలోనూ ప్రతి వస్తువు ధరను స్పష్టంగా తెలిపే రేట్ బోర్డును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రవి పటేల్ కోరుతున్నారు.



# గిరిజనుల హక్కులను కాపాడుతూ.. అటవీని సంరక్షించాలి

## అంబాసత్రం భూమిని గుర్తించి 15 రోజుల్లో స్పష్టతకు చర్యలు

## అటవీ--రెవెన్యూ భూ సమస్యలకు సమగ్ర సర్వేతో పరిష్కారం చూపాలి

## జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్





**లక్ష్మీదేవిపల్లి,ఆగస్ట్ 24( భద్రాద్రిన్యూస్ ):-**

లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టి పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కూనారం గ్రామంలో అటవీ--రెవెన్యూ భూములకు సంబంధించిన సమస్యలపై జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌కు అందిన ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ క్షేత్రస్థాయిలో పర్యటించి భూ పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గిరిజనులు, స్థానిక ప్రజలు, రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి సమస్యకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జాటోత్ హుస్సేన్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించకుండా భూ సమస్యలపై తుది నిర్ణయానికి రావడం సరికాదన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల రికార్డులు, వాదనల్లో భిన్నతలు ఉన్న నేపథ్యంలో గతంలో నిర్వహించిన సర్వేలు, జాయింట్ సర్వే నివేదికలు, సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని సూచించారు. పాత సర్వేకు, తాజా జాయింట్ సర్వేకు మధ్య తేడాలు ఎందుకు వచ్చాయో స్పష్టంగా తేల్చాలన్నారు.

అంబాసత్రం భూమికి సంబంధించిన అంశంపై కూడా స్పష్టత తీసుకురావాలని కమిషన్ సభ్యులు సూచించారు. గతంలో సుమారు 250 ఎకరాలకు పైగా అంబాసత్రం భూమి ఉన్నట్లు అధికారులు విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం ఆ భూమి రికార్డుల్లో స్పష్టంగా కనిపించకపోవడానికి కారణాలను పరిశీలించాలన్నారు. అంబాసత్రం భూమి ఎక్కడ ఉందో గుర్తించి, ఓవర్‌ల్యాప్ అయిన ప్రాంతాలను కూడా మరోసారి సమగ్రంగా సర్వే చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి 15 రోజుల్లో ప్రాథమిక స్పష్టతకు చర్యలు తీసుకోవాలని కోరారు.

జాయింట్ సర్వే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని జాటోత్ హుస్సేన్ స్పష్టం చేశారు. సర్వే సమయంలో పిటిషనర్లు, సంబంధిత భూ హక్కుదారులు, గ్రామస్తులు, రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల ప్రతినిధుల సమక్షంలో ప్రక్రియ నిర్వహించాలని, సంబంధిత వ్యక్తుల సంతకాలు, వాంగ్మూలాలు నమోదు చేయాలని సూచించారు. న్యాయస్థానాలకు నివేదికలు సమర్పించే సమయంలో సర్వే ప్రక్రియకు సంబంధించిన పూర్తి ఆధారాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గిరిజనుల జీవనోపాధి ప్రధానంగా భూమి, అడవులపైనే ఆధారపడి ఉంటుందని, వారి హక్కులను పరిరక్షిస్తూ అటవీ సంరక్షణకు చర్యలు చేపట్టాలని జాటోత్ హుస్సేన్ అన్నారు . అటవీ శాఖ అధికారులు గిరిజనులతో స్నేహపూర్వకంగా, సమన్వయంతో పనిచేయాలని, అటవీ సంరక్షణతో పాటు గిరిజనుల జీవనోపాధి, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

అర్హులైన గిరిజనులకు అటవీ హక్కుల చట్టం, ఇతర ప్రభుత్వ నిబంధనల ప్రకారం హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గిరిజనులకు భూ హక్కులు, ప్రభుత్వ పథకాలు, దరఖాస్తు విధానం తదితర అంశాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించడం అధికారుల బాధ్యత అన్నారు . నీరు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలతో పాటు వ్యవసాయం, ఉద్యాన పంటలు, కాఫీ, టీ తదితర ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలపై కూడా ప్రోత్సాహం అందించాలని సూచించారు.

గిరిజనులపై అనవసరంగా కేసులు నమోదు చేయకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని కమిషన్ సభ్యులు సూచించారు. అదే సమయంలో అటవీ సంరక్షణకు సంబంధించిన చట్టాలు, నిబంధనలను గిరిజనులకు అవగాహన కల్పించి, అటవీ నరికివేత వంటి చర్యలకు దూరంగా ఉండేలా చైతన్యం కల్పించాలని తెలిపారు. ప్రజలు కూడా అటవీ శాఖ అధికారులతో ఘర్షణలకు దూరంగా ఉండి, తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అటవీ శాఖ, గిరిజనుల మధ్య సోదరభావంతో కూడిన సంబంధాలతో అటవీని సంరక్షించడం ఎంత ముఖ్యమో, అటవీపై ఆధారపడి జీవించే గిరిజనుల జీవనోపాధిని పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమన్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ , కూనారం గ్రామానికి సంబంధించిన భూ సమస్యపై గతంలో నిర్వహించిన సర్వేలు, జాయింట్ సర్వే నివేదికలను పరిశీలించినట్లు తెలిపారు. జాయింట్ సర్వేకు ముందు, అనంతరం నిర్వహించిన సర్వే వివరాలతో పాటు రెవెన్యూ, అటవీ శాఖల వద్ద ఉన్న రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తహసీల్దార్, సర్వే అధికారులు, అటవీ శాఖ అధికారులు అందుబాటులో ఉన్న రికార్డులు, మ్యాపులు, సర్వే నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులను కూడా పరిశీలించి తుది నిర్ధారణకు రావాలని కలెక్టర్ సూచించారు. పాత సర్వేలు, తాజా జాయింట్ సర్వే, రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసి తుది నివేదిక రూపొందిస్తామని తెలిపారు.

దమ్మపేట, కరకగూడెం, అశ్వారావుపేట తదితర ప్రాంతాల్లో కూడా ఇలాంటి అటవీ--రెవెన్యూ భూ సమస్యలు ఉన్నాయని కలెక్టర్ అన్నారు . ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే జాయింట్ సర్వే ప్రక్రియ ప్రారంభమైందని, వచ్చే ఆరు నుంచి ఏడు నెలల్లో ఆయా సమస్యలపై స్పష్టత వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కూనారం సమస్య చాలా కాలంగా కొనసాగుతున్నందున దీనికి శాశ్వత పరిష్కారం చూపేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ , కమిషన్ సభ్యులు ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత ఫైళ్లు, రికార్డులను పరిశీలిస్తున్నామని తెలిపారు. జిల్లాలో సుమారు 60 శాతం వరకు అటవీ ప్రాంతం ఉందని, అటవీ సంరక్షణతో పాటు గిరిజనుల సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

జిల్లాలో ఇప్పటివరకు సుమారు 2.10 లక్షల ఎకరాలకు పైగా భూమిని పోడు భూమి కింద హక్కులు కల్పించినట్లు, సుమారు 13 వేల మంది గిరిజనులకు బోర్‌వెల్స్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అనేక ప్రాంతాల్లో పోడు భూములకు రహదారి సౌకర్యాలు కూడా కల్పించినట్లు వివరించారు.

కూనారం సమస్యకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే, అటవీ శాఖలు, గ్రామ పాలనా సిబ్బందితో సంయుక్త కమిటీ ఏర్పాటు చేసి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ కమిటీ 7 మార్చి 2026న నివేదిక సమర్పించిందని, అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా సంబంధిత భూమి అటవీ భూమిగా ఉన్నట్లు నివేదికలో తెలిపినట్లు వివరించారు. ప్రస్తుతం అంబాసత్రం భూమికి సంబంధించిన అంశం కూడా వెలుగులోకి వచ్చినందున, దీనిపై మరోసారి సమగ్రంగా పరిశీలించి రికార్డులు, చట్టపరమైన అంశాలు, జాయింట్ సర్వే ఫలితాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ , కూనారం గ్రామంలోని భూ సమస్య గత ఐదారు సంవత్సరాలుగా కొనసాగుతోందన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో కొన్ని పోడు భూములకు ఇప్పటికే పట్టాలు మంజూరైనప్పటికీ, నిర్దిష్ట సర్వే నంబరుకు సంబంధించిన భూమి రెవెన్యూ పరిధిలోకి వస్తుందా లేదా అటవీ శాఖ పరిధిలోకి వస్తుందా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందన్నారు.

ఈ ఏడాది కూడా సంబంధిత భూమిపై జాయింట్ సర్వే నిర్వహించినట్లు ఐటీడీఏ పీవో తెలిపారు. అయితే సర్వే అనంతరం కూడా కొన్ని అభ్యంతరాలు, సందేహాలు వ్యక్తమవుతున్నందున జిల్లా కలెక్టర్, డీఎఫ్ఓతో చర్చించి సమగ్రంగా పరిశీలిస్తామని చెప్పారు. భూమి రెవెన్యూ భూమిగా నిర్ధారణ అయితే అందుకు అనుగుణంగా, అటవీ భూమిగా నిర్ధారణ అయితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు. సాగు చేసుకుంటున్న అర్హులైన గిరిజనులకు ఎట్టి పరిస్థితుల్లోనూ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ, అటవీ, సర్వే, ఐటీడీఏ శాఖలు సమన్వయంతో పనిచేసి కూనారం భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తాయని తెలిపారు.

ఈ పబ్లిక్ హియరింగ్‌లో కొత్తగూడెం ఆర్డీవో మధు తాసిల్దార్ శిరీష రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులు, సర్వేయర్లు, గ్రామస్థులు, గిరిజనులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియాన్ని బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న నిందితుడిపై పీడీ యాక్ట్

**పోలీస్ కమిషనర్**

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 24( భద్రాద్రిన్యూస్ ):-**

పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి అంతర్రాష్ట్రాలకు తరలించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ ఆర్థిక లాభాలు ఆర్జిస్తున్న మీర్జా జిలానీ బేగ్ (48) సం,,పై పీడీ యాక్ట్‌ను అమలు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన మీర్జా జిలానీ బేగ్ (48) సం,, రేషన్ డీలర్లు, వారి ఏజెంట్ల ద్వారా కార్డుదారులకు అందాల్సిన సబ్సిడీ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

నిందితుడిపై తల్లాడ పోలీస్ స్టేషన్లలో పీడీఎస్ బియ్యం అక్రమ కొనుగోలుసంబంధించి మొత్తం నాలుగు కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ కేసుల్లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఎసెన్షియల్ కమాడిటీస్ యాక్ట్ (ఇసిఎ), తెలంగాణ పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్స్‌కు సంబంధించిన వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇలాంటి కార్యకలాపాల ద్వారా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఉద్దేశించిన ఆహార భద్రత వ్యవస్థకు తీవ్ర విఘాతం కలుగుతోందని, సమాజానికి అవసరమైన నిత్యావసర వస్తువుల సరఫరా వ్యవస్థను కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై గతంలో పలుమార్లు కేసులు నమోదు కావడంతో పాటు, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసినప్పటికీ తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని, ఈ నేపథ్యంలో పీడీ యాక్ట్ అమలు చేసి వైరా సిఐ వెంకట ప్రసాద్, తల్లాడ ఎస్సై వెంకట కృష్ణ నిందితుడిని అదుపులోకి తీసుకోని హైదరాబాద్‌లోని చంచల్‌గూడ సెంట్రల్ జైలు తరలించడం జరిగింది.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.



# రైతు బీమా కొనసాగించాలి

రైతులకు అండగా నిలిచే రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం వరంగల్ ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు.తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు ఆధ్వర్యంలో ప్రజావాణి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. రైతు బీమా పథకం విషయంలో రైతుల్లో నెలకొన్న ఆందోళనను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, రైతు కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా బీమా పథకాన్ని నిరంతరాయంగా కొనసాగించాలని వినతిపత్రంలో కోరారు.

రైతు కుటుంబంలో ప్రధాన ఆధారమైన వ్యక్తి అనుకోని ప్రమాదానికి గురైనప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రైతు బీమా రక్షణగా నిలుస్తుందని, అందువల్ల రైతు బీమా విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని కోరారు.పెండింగ్‌లో ఉన్న బీమా క్లెయిమ్‌లను కూడా త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు.వరికెల కిషన్ రావు మాట్లాడుతూ, రైతు బీమా పథకం రైతు కుటుంబాలకు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, కష్టకాలంలో అండగా నిలిచే భరోసా అని అన్నారు. రైతు బీమాపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇచ్చి, రైతుల ఆందోళనకు ముగింపు పలకాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, జిల్లా నాయకులు చౌల రామారావు, సుక్కినే సుధాకర్ రావు, అంబిరి శ్రీనివాస్, సురాబు బాపూరావు, వాంకే రాజు, మాధవరావు, ఎర్రబెల్లి రవీందర్, గుండా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.